
"బామ్మా! అసలేమిటోనే అందరూ నన్ను ఐరన్‌లెగ్ శాస్త్రి అని, ముదిరిపోయిన ముంజకాయ, కొరకరాని బెండకాయ, వీడికింకేం పెళ్ళి ఔతుందిరా అంటూ ఎగతాళి చేస్తూ ఏడిపిస్తున్నారే! నేను అసలు ఆఫీసుకేపోను" అంటూ బుంగమూతి పెట్టి, బామ్మ ఒళ్ళో తల దాచుకున్నాడు బాబ్జీ.

"మా నాన్నే, మా కన్నే, మా బంగారుకొండే నిన్ను అలా అన్నదెవరురా? ఈ రోజుల్లో అసలు అతి చిన్న వయస్సులో పెళ్లి చేసుకొనే వారు ఎవరున్నారు చెప్పు? పల్లెటూరి ప్రజలు తప్ప. మన ప్రభుత్వమే ఆడవాళ్ళకైతే ఇరవై ఐదు సంవత్సరాలు, మగాళ్ళకైతే 30 సంవత్సరాలు పెళ్ళి వయస్సుగా నిర్ణయించింది. మరి నీకు నిన్నగాక మొన్ననే గదా! మూడుపదులు దాటింది. అయినా నీకేమైందని? కన్నొంకరా? కాలొంకరా? అల్లనేరేడు పండులాంటి అందమైన రంగు, ముఖంపై ముత్యాల్లాంటి ముద్దొచ్చే మొటిమలు, పిల్లనగ్రోవి ఇచ్చి పిలకకడితే అచ్చు



# బామ్మ బాబ్జీ

ఆ చిన్నికృష్ణుడే అనుకో. కాస్త స్థూలకాయం అంతే. నీకంటే అందహీనమైన అడ్డగాడిద లందరికీ లక్షలకు లక్షలు కట్నాలు, కానుకలూ ఇచ్చి పిల్లలనిస్తూ ఉంటే నీకెందుకు కాదురా? దర్జాగా అవుతుంది. కార్తీక మాసంలో నేనే ఎంచక్కా నీ పెళ్ళి చేస్తా. నువ్వేం బాధపడకురా బాబ్జీ".

"కన్నూ కాలూ కాదే బామ్మా! నాకు శరీరమంతా ఒంకర టింకరలేనట. ఎత్తు, ఒంపులేనట. బామ్మా! కార్తీక మాసం అంటే ఎప్పుడే? ఇంకా ఎంతకాలం? అమ్మాయిని ఎక్కడన్నా చూసావా! మా ఆఫీసులోనే నేనే ఎవరినన్నా ప్రేమించేసుకోనా?"

"అంత పని చేయకురా! మీ అమ్మా నాన్నలకు నేను మాటిచ్చాను. అమ్మాయిని కూడా చూసా! అన్ని విధాలా నీకు తగ్గ జోడి. ఎత్తు, శిస్తు, అందం చందం, ఒడ్డూ పొడుగు, ఆరోగ్యం ఐశ్వర్యం అన్నీ ఉన్న అమ్మాయినే చూసా! ఎవరనుకొంటున్నావురా! మీ మామయ్య కూతురు. అదే గజలక్ష్మి లేదూ... అది ఎంత బాగుంటుందనుకొన్నావు?".

"అమ్మో! ఆ గజలక్ష్మి! నేను చేసుకోనే! నాకన్నా ఇంకాస్త స్థూలకాయం. ఇక రంగైతేనా సిలిండర్ బుడ్డి. చీకట్లో చూస్తే జడుసుకొనేంత భయంకరంగా ఉంటుంది. దానికంటే మా ఆఫీసు అటెండర్ 'ఆరోగ్యమ్మ' నయం. ఇక నా మీద చెయ్యో, కాలో వేసిందంటే నేనుంటానా?ఇక ఇద్దరంఎక్కడికైనా కలిసి వెళ్ళాలంటే చెరొక ఆటోకావాలే తప్ప ఇద్దరం ఒకే రిక్షాలో కూర్చోగలమా చెప్పు? పెళ్ళి లేకున్నా పరవాలేదుగానీ ఆ గజలక్ష్మి నాకొద్దే".

"అలా అంటే ఎలారా? ఎవరికి దగ్గ జోడి వాళ్ళు చూసుకోవాలి. నీకు అన్ని విధాలా ఆ గజలక్ష్మే సరైన జోడి. పెళ్ళి అయిన తరువాత ఇద్దరూ కలిసి వాకింగ్, డైటింగ్ చేసి నాజూకుగా, బక్కగా తయారవుదురుగాని. అయినా ఈ మధ్య ఆ అమ్మాయిని నువ్వు చూడలేదుగానీ మొన్న ఒక ఫంక్షన్‌లో నేను చూసా. పట్టు చీరలో ఎంత బాగుందనుకొన్నావు?"

"లేనత్త కంటే గుడ్డత్త నయం అన్నట్టు... అయితే తప్పదంటావా? ఆ గజలక్ష్మే అర్ధాంగా?! హతవిధీ అసలు పెళ్ళికాకుండా ఉండడం కన్నా పెళ్ళైందనిపించుకొంటే చాలు...

"ఆ... ఆ... సరేగానీ ఒరే బాబ్జీ! ఈ రెండు నెలలూ నువ్వు కొంచెం ఆ బేకరీ షాపుల్లో ఆ పిజ్జాలు, బర్గర్లు, కేకులు, ఐస్‌క్రీములు, స్వీట్లు తినడం బందుపెట్టు. అప్పుడు కొంచమన్నా సన్నపడతావు కొంచెం స్మార్టుగా కనబడతావు.

"బామ్మా! నువ్వేమన్నా చెప్పు వింటాగాని, నేనవి మానడం కష్టం"

"అలా అంటే నీకు పెళ్ళి ఎలా అవుతుం

కందాళ సుదర్శన్

దిరా? నే చెప్పినట్టు వింటేనే ఎంచక్కా నీకు ఆ గజలక్ష్మితో మూడు ముళ్ళు వేయిస్తా. లేదంటావా! నీ ఇష్టం."

"సరేగానీ ఒకేసారి మానడం అంటే నా వల్లకాదు కొంచెం కొంచెం తగ్గిస్తా. సరేనా!"

"సరే అలాగే కానియ్యి. అయితే రేపటి నుంచి నేను పెట్టిన టిఫిన్ తప్ప బజార్లో, ఆఫీసులో అడ్డమైన గడ్డీ కరవకు."

సరేనే బామ్మా! నీఇష్టం.

కొద్దిరోజులయ్యాక "ఒసే బామ్మా! నీ సలహాల ప్రకారం వాకింగ్, డైటింగ్ చేస్తే రోజు రోజుకీ నీరసించిపోతున్నానే. కాస్త నిమ్మ రసమన్నా ఇవ్వు. అబ్బా! ఆ పెళ్ళివరకన్నా నేను ఉంటానో లేదో!"

"అవేం అమంగళమైన మాటలురా! శుభమా అని రేపే మనం పెళ్ళి చూపులకెడుతుంటేనూ.

"ఔనా బామ్మా! నిజంగా రేపు పెళ్ళి చూపులకెడుతున్నామా!"

"ఔన్రా! మీ మామయ్యకు మనం వస్తున్నట్టు నిన్ననే ఫోన్ కూడా చేశా! అయ్యవారిని కూడా అడిగా! ఆలస్యమెందుకు అన్నీ సర్దుకో. రేపే వెడదాం. సరేనా?

ఔనే బామ్మా! సరేగానీ... మరేమో నాకు ఒక మంచి డ్రెస్సూ లేదు. కొన్న డ్రెస్సులన్నీ బిగ్గరైపోయినాయి. వెళ్ళి షాపింగ్ చేసొద్దాం పద."

"నీ సైజు నెంబరు బనియన్లు, డ్రాయర్లు, డ్రస్సులు లేకనేకదరా! ప్రతిసారీ పది మీటర్ల బట్ట చొక్కాకి, 12 మీటర్లు ప్యాంటుకీ తెచ్చి, దానికి కావలసిన జిప్పులు, బటన్లు, దారాలు, ఇచ్చి ప్రత్యేకంగా కుట్టించాం. ఈసారికి ఎలాగో అవే వేసుకో. పెళ్ళికి ప్రత్యేకంగా ఆర్డర్ ఇచ్చి తయారుచేపిద్దాం. లేకుంటే ఎన్ని షాపులు తిరగాలో ఏమో... లేటౌతుంది."

"బామ్మా అన్నీ వద్దంటున్నావు. ఏమిటో ఏమో?


"అది సరేగానీ ఓరే బాబ్జీ రేపు ప్రయాణానికి అన్ని సర్దుకో!

★ ★ ★

అతికష్టం మీద బామ్మా బాబ్జీ రెండు బస్సులు, ఓ ఆటో మారి రంగాపురం చేరుకొన్నారు. బామ్మ, బాబ్జీల కోసమే ఎదురుచూస్తున్న పాపారావు, పార్వతులు ముంగిట్లోనే స్వాగతం పలికి, సాదరంగా ఆహ్వానించారు. కాళ్ళూ చేతులూ కడుక్కొన్న తరువాత ముందుగదిలో ఏర్పాటు చేసిన రెండు పెద్ద పెద్ద కుర్చీల్లో అలసిన శరీరాలకు విశ్రాంతినిచ్చారు. బామ్మా, బాబ్జీలు కుశల ప్రశ్నలు, టీలు, టిఫిన్లు పూర్తయ్యాక వర్షం వస్తుందేమో అమ్మాయిని తీసుకు రండి. మా వాడు మరీ తొందరపడుతున్నాడు అన్న బామ్మ పిలుపుతో సరే అలాగే అంటూ 'ఓసే పార్వతీ అమ్మాయి గజాన్ని తీసుకురా" అన్నాడు పాపారావు.

బాబ్జీ చూపులు ద్వారం వైపే ఉన్నాయి. మూడు నిమిషాల్లో ముద్దుగా బొద్దుగా మేరు పర్వతం కదలివచ్చినట్లు ఒక్కొక్క అడుగూ అతి కష్టం మీద వేస్తూ వచ్చి కూర్చుంది గజలక్ష్మి. అంతే... బాబ్జీకి గుండె ఆగినంత పనయ్యింది. "బామ్మా ఆవిడ అమ్మాయేనా!"

"ఔనురా. ఏం బాగాలేదా? నీ ముఖానికి అంతకంటే మంచిఅమ్మాయి దొరుకుతుందా? చూడు... చూడు... అమ్మాయిని బాగా చూడు. మీ అమ్మపోతూ తన కొడుక్కి, తన అన్నకూ




తురుకీ పెళ్ళిచేసే బాధ్యత నాకు అప్పగించి వెళ్ళింది. అందుకేరా ఇంత కష్టపడుతున్నా."

"అదా సంగతి, ఓసే బామ్మా! మేనరికాలు మంచివి కాదని మన డాక్టర్లంతా మొత్తుకుంటుంటే? అయినా, బామ్మా! అది పొట్టా, యాదగిరి గుట్టా? అవి కాళ్ళా అరటి బోదెలా! అవి బుగ్గలా నూనెలో పొంగిన బూరెలా? జడ ప్లేసులో మెడే కనిపిస్తోంది. తప్ప జడలేదే. ముక్కూ మూతీ కలిసిపోయి ముద్ద పిసికేసినట్టున్న ముఖం. బామ్మా! నాకు భయమేస్తుందే ఈ పెళ్ళి నాకొద్దు, పెద్దవాళ్లేదో చెప్పిపోయారని ఉన్న నాకు ఉరిపొయ్యకు."

ఒరే నీకు అలాగే ఉంటుంది కానీ నోరు మూసుకో. అమ్మా! గజం... ఒక్కసారి బావ బాబ్జీ వైపు చూడమ్మా అనగానే ఒక్కసారి మేరు పర్వతంపై ఉన్న మెడను తిప్పి బాబ్జీ వంక క్రీగంటితో అదోలా చూసింది. అంతే... బాబ్జీ గుండెల్లో గునపాలు గుచ్చుకొన్నాయి. శరీరమంతా చమటతో తడిసిపోయింది. ఆ చూపుల్లో మన్మథ బాణాలు కావు... మండే ఇనుప చువ్వలు గుచ్చుకొన్నాయి. బాధతో మెలికలు తిరిగిపోతూ 'బామ్మా బాధ తట్టుకోలేనే. పోదామే... అన్నట్టు సైగ చేసాడు.

ఆ తరువాత కట్నాలు, కానుకల విషయం అన్నీ బామ్మే మాట్లాడింది. మేం మూడు లక్షలు ఇస్తాం. మీరు మాత్రం ముచ్చటగా మా అమ్మాయి ముద్దు తీర్చాలి అన్నారు అమ్మాయి అమ్మా నాన్న. అదేమిటంటే - అమ్మాయికి నగలూ నాణ్యాలు ఏం అక్కరలేదు గానీ ఒక్క వజ్రాలు పొదిగిన వడ్డాణం మాత్రం చేయించండి అన్నారు.

'అమ్మో! ఒడ్డాణమే' అంటూ అక్కడనుండి అంతర్థానమయ్యారు బామ్మ-బాబ్జీ. ఆ మర్నాడు "ఒరే బాబ్జీ! నీకు నచ్చి, నువ్వు మెచ్చిన అమ్మాయిని లవ్వాడరా" అంది బామ్మ. అంతే... ఆనందంతో గంతేశాడు బాబ్జీ. ●